


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
24-12-2025
పేజీలు: 02





## డైలాగ్ ఒక్కటీ లేకుండా భయపెట్టించిన గ్లింప్స్

డిఫరెంట్ కాన్సెప్ట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు రవిబాబు తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. పూర్తిగా డైలాగ్‌లేని, భీకరమైన విజువల్స్‌తో కూడిన గ్లింప్స్‌ను విడుదల చేస్తూ, తన కొత్త సినిమా టైటిల్‌ను 'రేజర్' గా వెల్లడించారు. 45 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్ పూర్తిగా థ్రిల్లర్ టోన్‌లో సాగింది. చేతులను నరికేయడం, శరీరాన్ని రెండు ముక్కలుగా కోయడం, కత్తితో తల నరికే సన్నివేశాలు చూపిస్తూ, ఒక్క మాట కూడా లేకుండా ప్రేక్షకులను షాక్‌కు గురిచేసింది. విజువల్స్ ఆధారంగా కథా భావనను తెలియజేయడం ఈ గ్లింప్స్ ప్రత్యేకతగా నిలిచింది. ఈ గ్లింప్స్‌లో రవిబాబు తప్ప మరే ఇతర ప్రముఖ నటులు కనిపించలేదు లేదా ప్రకటించడం చేయలేదు. అయితే, చూపించిన సన్నివేశాలు మాత్రం థ్రిల్లర్ సినిమాల అభిమానులను వెంటనే ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా డార్క్, వైలెంట్ థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా గట్టిగా కనెక్ట్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది.ఈ చిత్రాన్ని ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ రెండు బ్యానర్లు మరోసారి కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రేజర్' సినిమాను సమ్మర్ 2026లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



## అఖండ 2 మేకింగ్ వీడియో


గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ — సెన్సేషనల్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన భారీ చిత్రం 'అఖండ 2: తాండవం' భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే తొలి ఆట నుంచే మిక్స్‌డ్ టాక్‌ను ఎదుర్కొన్న ఈ సినిమా, ఆ తర్వాత నెగటివ్ జోన్‌లోకి వెళ్లడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. తొలి వారంలోనే తీవ్ర తడబాటుకు గురైన ఈ చిత్రం, చివరకు డిజాస్టర్ దిశగా అడుగులు వేస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. 'అఖండ' సినిమా ఘన విజయం సాధించడంతో, దానికి సీక్వెల్‌గా వచ్చిన 'అఖండ 2'పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. దాంతో ఈ సినిమా థియేట్రికల్ బిజినెస్ కూడా భారీగా జరిగింది.

# మొబైల్ రీఛార్జ్ ధరలు పెంపు?

మొబైల్ వినియోగదారులకు కొత్త ఏడాదిలో షాక్ తగలనుంది. రీచార్జ్ ధరలు ఊహించని స్థాయిలో పెరగనున్నాయి. ఏకంగా 16 నుంచి 20 శాతం వరకు టారిఫ్ ధరలు పెరగనున్నాయి. 2026 జనవరి ప్రారంభంలోనే పెంచేందుకు టెలికాం కంపెనీలు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. కొత్త ఏడాది స్టార్ట్ అవ్వగానే వెంటనే ప్రకటన చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాయి. కొత్త సంవత్సరంలోకి హ్యాపీగా అడుగుపెట్టాలనుకుంటున్న ప్రజలకు ఇది చేదువార్తగానే చెప్పవచ్చు. దీని ప్రభావంతో మొబైల్ వినియోగదారులకు ఖర్చు మరింత పెరగనుంది. ఒక రీఛార్జ్‌పై ఏకంగా రూ.100 మేర పెంచనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఎయిర్‌టెల్ 28 రోజుల వ్యాలిడిటీ గల బేసిక్ 5జీ ప్లాన్ రూ.319కు లభిస్తుంది. జనవరిలో ఈ ప్లాన్ ధర రూ.419 కానుంది. అంటే మీపై అదనంగా రూ.100ల భారం పడనుంది. ఇక జియో బేసిక్ రీచార్జ్ ప్లాన్ రూ.299కే ప్రస్తుతం అందుబాటులోకి ఉంది. దీని ధర కూడా రూ.359కు పెంచే అవకాశముందని తెలుస్తోంది. ఇక రూ.349లుగా ఉన్న 28 రోజుల వ్యాలిడిటీతో కూడిన 5జీ ప్లాన్ రూ.429కి పెరగవచ్చు.ఇక డేటా ప్లాన్ల




ధరలు కూడా అధికం కానున్నాయి. వొడాఫోన్ ఐడియా ప్రస్తుతం 28 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1జీబీ డేటాతో అందిస్తున్న ప్లాన్ ధర రూ.340గా ఉండగా.. త్వరలో ఇది రూ.419 కానుంది. ఇక 56 రోజుల వ్యవధిలో రోజువారీ 2జీబీ డేటా అందించే ప్లాన్ ధర రూ.579 నుంచి రూ.699కి చేరుకోనుంది. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా కంపెనీలన్నీ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్, డేటా రీచార్జ్‌ల ధరలన్నీ పెంచనున్నాయి. 20 శాతం వరకు పెంచవచ్చని మార్కెట్‌ను రీసెర్చ్ చేసి అంచనా వేసే మోర్గాన్ స్టాన్లీ సంస్థ తెలిపింది. 2026లో యావరేజ్ రెవెన్యూ పర్ యూజర్ పెంచాలని టెలికాం కంపెనీలు నిర్ణయించాయని ,దీని వల్ల రీఛార్జ్ ధరలు పెంచనున్నాయని తన నివేదికలో స్పష్టం చేసింది. ప్రతీ ఏటా టెలికాం కంపెనీలు రీఛార్జ్ ధరలను పెంచుతున్నాయని, వచ్చే ఏడాది కూడా అదే జరగనుదని పేర్కొంది. అతి త్వరలోనే పెంపు చూడవచ్చని తెలిపింది.




## ఢిల్లీలో మూడు రోజులు ఉంటే.. అలర్జీలు వచ్చాయి : నితిన్ గడ్కరీ

దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.

## రష్మిక 'మైసా' యాక్షన్ గ్లింప్స్




'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అమాయకమైన యువతిగా ఆకట్టుకున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న, ఇప్పుడు తన నెక్స్ట్ మూవీ 'మైసా' కోసం వెరైటీ అవతారంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నూతన దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో రష్మిక కనిపించిన విధానం ఆమె కెరీర్‌లోనే తొలిసారి అని చెప్పాలి. ఒళ్లంతా రక్తం, తెగిపోయిన చేతి బేడీలు, చేతిలో గన్, కళ్లలో రగిలే కోపం_ _ _ ఒక గిరిజన తిరుగుబాటు యువతిగా ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.


## ఎస్బీఐ నుంచి దిమ్మతిరిగే న్యూస్

బ్యాంకింగ్ కస్టమర్లకు గుడ్‌న్యూస్. దేశంలోనే నెంబర్ వన్ ప్రభుత్వ రంగ బ్యాంకుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రజలకు న్యూ ఇయర్ సందర్భంగా అద్భుతమైన కొత్త స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందగలిగే నూతన ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని లాంచ్ చేసింది. అధిక వడ్డీ అందించే ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక రిటర్న్స్ అందుకోవచ్చు. ఈ కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్ గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. గ్రీన్ రూపీ టర్మ్ డిపాజిట్ పేరుతో దీనిని ఎస్బీఐ ప్రారంభించింది. ఈ పథకంలో భారత్‌లో నివసించేవారితో పాటు ప్రవాస భారతీయులు, ఎన్ఆర్ఐలు పెట్టుబడి పెట్టవచ్చు. మూడు కాల పరిమితులతో మనం ఇన్వెస్ట్ చేయవచ్చు. 1,111, 1,777, 2,222 రోజుల కాలపరిమితులు ఎంచుకుని పెట్టుబడి పెట్టవచ్చు. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్రాంచుకి వెళ్లి ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టే అవకాశం ఉండగా.. త్వరలో యోనో యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు రానుంది. 1,111 రోజుల టెన్యూర్ ఎంచుకున్నవారికి 6.65 శాతం, 1,777 కాలపరిమితితో 6.65 శాతం, 2,222 రోజుల కాలవ్యవధి ఎంచుకుంటే 6.40 శాతం వడ్డీ లభిస్తుంది.





## ఫోన్ ట్యాపింగ్ కేసులో పెన్ డ్రైవ్ కలకలం!

ఫోన్ టాపింగ్ కేసులో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఆధారంగా ఒక పెన్ డ్రైవ్ మారడంతో దానిపైనే ఇప్పుడు ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) విచారణ మొత్తం కేంద్రీకృతమైంది. ఫోన్ టాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక డేటా ఈ పెన్ డ్రైవ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో కేసు మరింత కీలక దశకు చేరుకుంది. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన సమయంలో ఫోన్ టాపింగ్‌కు సంబంధించిన వివరాలను ఈ పెన్ డ్రైవ్‌లో స్టోర్ చేసినట్లు సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ పెన్ డ్రైవ్‌లో వందల సంఖ్యలో ఫోన్ నంబర్లు ఉండటంతో పాటు, వాటికి సంబంధించిన పూర్తి ప్రొఫైల్స్ కూడా భద్రపరచినట్లు అధికారులు గుర్తించారు. పెన్ డ్రైవ్‌లో రాజకీయ నేతలు, ప్రముఖ జర్నలిస్టులు, అలాగే హైకోర్టు న్యాయమూర్తులకు సంబంధించిన ఫోన్ నంబర్లు, ప్రొఫైల్స్ ఉన్నట్టు సిట్‌కు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఈ డేటా ఆధారంగానే ఎవరి ఫోన్లు టాపింగ్‌కు గురయ్యాయనే విషయాన్ని సిట్ గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పెన్ డ్రైవ్‌లో ఉన్న సమాచారాన్ని ప్రభాకర్ రావు ముందుంచి, సిట్ అధికారులు విచారణ చేపడుతున్నారు.




టాపింగ్ ఎలా జరిగింది, ఎవరి ఆదేశాల మేరకు ఈ డేటా సేకరించబడిందన్న అంశాలపై లోతైన ప్రశ్నలు వేస్తున్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు టీమ్ ఫోన్ టాపింగ్‌కు సంబంధించిన అనేక ఆధారాలను నాశనం చేసినప్పటికీ, ఈ పెన్ డ్రైవ్‌ను మాత్రం సిట్ స్వాధీనం చేసుకోవడం కేసులో కీలక పరిణామంగా మారింది. కేసును నిరూపించేందుకు ఈ పెన్ డ్రైవ్ బలమైన సాక్ష్యంగా ఉపయోగపడుతుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. మూడు రోజుల పాటు ప్రభాకర్ రావు విచారించి, అతని నుంచి పూర్తి వివరాలు, స్పష్టమైన వివరణలను సేకరించేందుకు సిట్ సిద్ధమైంది. ఈ పెన్ డ్రైవ్ ఆధారంగా ఫోన్ టాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## లైంగిక వేధింపుల కేసు.. ప్రముఖ దర్శకుడు అరెస్ట్



మలయాళ చిత్ర దర్శకుడు, మాజీ ఎమ్మెల్యే పీటీ కుంజు ముహమ్మద్ అరెస్ట్ అయ్యారు. మహిళపై లైంగిక వేధింపుల కేసులో ఆయన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. అయితే, కాసేపటికే అతను బెయిల్‌పై విడుదలైనట్లు చెప్పారు. ఇటీవలే జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ కేరళ కోసం మలయాళ చిత్రాలను ఎంపిక చేసే ప్రక్రియ కోసం కుంజు ఓ హోటల్‌లో బస చేశారు. ఆ సమయంలో ఓ మహిళను కుంజు లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఈ నెల ఆరంభంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కుంజు పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆ సమయంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ కేసులో కుంజు ఇప్పటికే కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందడంతో.. అతన్ని విడుదల చేశారు.



## రిస్క్ అవసరమా అంటున్న ఫ్యాన్స్

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్కీ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంచైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలీం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్-థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM


# నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా

## ఎమ్మెల్యే దానం నాగేందర్



తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒప్పుకున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు, ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని తెలిపారు. నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని దానం నాగేందర్ అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మొత్తం 300 డివిజన్లలో గెలుస్తాయని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అంతా ప్రచారం చేస్తానని.. కాంగ్రెస్ పథకాలను వివరిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు దిశగా గులాబీ పార్టీ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరూ తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో దానం నాగేందర్ మాత్రం తాను కాంగ్రెస్‌లో ఉన్నానని ఒప్పుకున్నారు. హైకమాండ్ నుంచి స్పష్టమైన హామీ రావడంతోనే దానం నాగేందర్ ఈ ప్రకటన చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ విచారణ జరుగుతున్న సమయంలో దానం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇప్పటి వరకు స్పీకర్ కు వివరణ ఇవ్వని దానం.. త్వరలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ పార్టీ తరపున ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే దానం ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దానం వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.

# వందేభారత్ రైలుకు తృటిలో తప్పిన ప్రమాదం



కేరళలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై ఓ ఆటో ఆగి ఉండడాన్ని గమనించిన లోకోపైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. తిరువనంతపురంలోని అకతుమురి హాల్ట్ స్టేషన్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. రైల్వే అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10.10 గంటలకు వందేభారత్ రైలు అకతుమురి హాల్ట్ స్టేషన్‌ను దాటి వెళ్తుండగా రైల్వే ట్రాక్‌పై ఓ ఆటో బోల్తాపడి ఉండడాన్ని లోకో పైలట్ గుర్తించారు. వెంటనే అత్యవసర బ్రేకులు వేసి, రైలును ఆపేశారు. అయితే రైలు వేగంగా వెళ్తుండటంతో వెంటనే ఆగలేదు. బోల్తాపడిన ఆటోను కొన్ని మీటర్ల దూరం నెట్టుకెళ్లింది. అయితే ఆటోలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లోకో పైలట్ అప్రమత్తంగా లేకపోయి ఉంటే రైలు పట్టాలు తప్పి ప్రమాదం జరిగేది. కాగా ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు ఆటోను పట్టాలపై నుంచి తొలగించారు. ట్రాక్ భద్రతను పరిశీలించిన అనంతరం రాత్రి 11.15 గంటలకు రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. సుధి అనే ఆటో డ్రైవర్ మద్యం మత్తులో తన ఆటోను పట్టాలపై బోల్తాపడేశాడు. ఆ తర్వాత ఆటోను అక్కడి నుంచి తీయడం చేతగాక జారుకున్నాడు. అయితే ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సుధిని గుర్తించి అరెస్టు చేశారు. ఘటనపై విచారణ జరుపుతున్నారు.



## మేడారం జాతర.. గద్దెలపై కొలువుదీరిన పగిడిద్ద రాజు, గోవిందరాజులు


మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది.

## చంచల్‌గూడ జైలుకు డీటీసీ కిషన్ నాయక్..




ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన మహబూబ్ నగర్ డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్‌కు ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో ఆయనను బుధవారం తెల్లవారుజామున చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో.. ఏసీబీ అధికారులు మంగళవారం హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లి ఆర్ఆర్ నగర్ కాలనీలోని కిషన్ నాయక్ నివాసంతోపాటు ఆయన సంబంధించిన పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్, నారాయణఖేడ్‌లలో ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాలతోపాటు మహబూబ్‌నగర్‌లోని జిల్లా రవాణాశాఖ కార్యాలయం సహా 12 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు.

# విడాకుల నోటీసు ఇచ్చిన వారం రోజులకే భార్యను చంపిన భర్త



విడాకులు నోటీసు ఇచ్చిన భార్యను భర్త హతమార్చాడు. ఈ ఘటన ఇవాళ బెంగుళూరులో జరిగింది. నిందితుడిని బాలమురగన్.. బాధితురాలిని భువనేశ్వరిగా గుర్తించారు. నోటీసులు ఇచ్చిన వారం రోజుల్లో భార్య ప్రాణాలు తీశాడు భర్త. నాలుగు రౌండ్ల కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. భార్యను చంపిన తర్వాత పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు భర్త. వివరాల్లోకి వెళ్తే. 40 ఏళ్ల బాలమురగన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. 39 ఏళ్ల భువనేశ్వరి యూనియన్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా చేస్తున్నది. ఆ జంట 2011లో పెళ్లి చేసుకున్నది. భర్తకు ఉద్యోగం రావడంతో 2018లో ఆ జంట బెంగుళూరుకు మకాం మార్చారు. తమిళనాడులోని సేలం జిల్లా వాళ్ల స్వగ్రామం. ఆ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే వైవాహిక బంధంలో సమస్యలు రావడంతో ఏడాది నుంచి ఒకరికి ఒకరు దూరంగా ఉంటున్నారు. రాజాజీనగర్‌లో పిల్లలో భువనేశ్వరి ఉంటోంది. అయితే ఆమెకు మరొకరితో రిలేషన్‌లో ఉన్నట్లు భర్త అనుమానించాడు. దీని వల్ల తరుచూ ఇద్దరి మధ్య గొడవలయ్యేవి. వారం క్రితం భువనేశ్వరి తన భర్తకు విడాకులు నోటీసు జారీ చేసింది. కోర్టులో ఆ కేసు పెండింగ్‌లో ఉన్నది. మంగళవారం తన భార్య కదలికలపై కన్నేసిన భర్త.. ఆమె ఆఫీసు నుంచి ఇంటికి రాగానే అటాక్ చేశాడు. సాయంత్రం 6.30 సమయంలో ఆమెపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడు. షాన్‌బాగ్ ఆస్పత్రికి ఆమెను తరలించారు. కానీ గాయాలు తీవ్రం కావడంతో ఆమె మార్గంలోనే చనిపోయింది. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నది. ఎక్కడ నుంచి తుపాకీ వచ్చిందన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.



## చలి తీవ్రతకు వణుకుతున్న కశ్మీర్

చలి తీవ్రతకు జమ్ము కశ్మీర్ గజగజ వణికిపోతోంది. శీతాకాలం కావడంతో కశ్మీర్ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. వ్యాలీ మొత్తం మంచు వర్షం కురుస్తోంది. దీంతో అక్కడ అతిశీతల వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. కొన్ని ఏరియాల్లో అయితే మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి. దాంతో అక్కడి సరస్సులు, కొలనుల్లోని నీరు గడ్డకట్టింది. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు గుల్మార్గ్, పహల్గామ్ హిల్ స్టేషన్లలో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయాయి. వాతావరణ శాఖ డేటా ప్రకారం.. శ్రీనగర్ (Srinagar)లో కనిష్ట ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. గుల్మార్గ్, పహల్గామ్‌లో వరుసగా మైనస్ 4.2, మైనస్ 2.2 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జమ్ము నగరంలో 8.2 డిగ్రీల సెల్సియస్, కాట్రా పట్టణంలో 9.4, బాటోట్‌లో 4.2, బనిహాల్‌లో 6.4, భదేర్వాలో 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

# వైభవ్ సూర్యవంశీ సెన్సేషనల్ సెంచరీ



వైభవ్ సూర్యవంశీ మళ్లీ చెలరేగాడు. సిక్సర్లు, ఫోర్లతో ఊచకోత కోశాడు. విజయ్ హజారే టోర్నీలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న వన్డేల్లో సెన్సేషనల్ సెంచరీ కొట్టేశాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డ బీహారీ యువ కెరటం.. కేవలం 84 బంతుల్లో 190 రన్స్ చేసి ఔటయ్యాడు. తాజాగా ముగిసిన అండర్19 ఆసియాకప్‌లోనూ సెంచరీతో హోరెత్తించిన వైభవ్.. ఇవాళ రాంచీలో జరుగుతున్న మ్యాచ్‌లో దుమ్మురేశాడు. సూర్యవంశీ ఇన్నింగ్స్‌లో 15 సిక్సర్లు, 16 బౌండరీలు ఉన్నాయి. 226 స్ట్రయిక్ రేట్‌తో వైభవ్ తన పవర్ హిట్టింగ్ ప్రదర్శించాడు. టాస్ గెలిచిన బీహార్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. ఫస్ట్ వికెట్‌కు వైభవ్, మంగళ్ ఇద్దరూ కలిసి 158 రన్స్ జోడించారు. ఆ తర్వాత జట్టు స్కోరు 261 రన్స్ వద్ద ఉన్న సమయంలో వైభవ్ వ్యక్తిగతంగా 190 రన్స్ చేసి నిష్క్రమించాడు. 14 ఏళ్ల సూర్యవంశీ బ్యాటింగ్ రికార్డులను తిరగరాశాడు. లిస్టు ఏ మ్యాచుల్లో సెంచరీ చేసిన యువ బ్యాటర్‌గా రికార్డు క్రియేట్ చేశాడతను. వన్డే క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 150 రన్స్ చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాడు. తొలి బంతి నుంచే హిట్టింగ్ చేసిన సూర్యవంశీ కేవలం 36 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత 54 బంతుల్లో అతను 150 రన్స్ మార్క్ క్రాస్ చేశాడు. తాజా సమాచారం ప్రకారం బీహార్ 29 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 272 రన్స్ చేసింది.



## చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు..

## అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు

సైబరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు చేశారు. గుజరాత్ నుంచి పసిపిల్లలను అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను గుర్తించి అరెస్టు చేశారు. సైబరాబాద్ స్పెషల్ పోలీస్ టీమ్స్.. గుజరాత్‌కు చెందిన ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతూ ఈ అక్రమ రవాణా వ్యవహారాన్ని గుర్తించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పసిపిల్లలను రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ముఠాకు మరిన్ని లింకులు ఉన్నాయనే అనుమానంతో గుజరాత్ పోలీసులతో సమన్వయం చేస్తూ విచారణ చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 100 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# చెప్పులు, బూట్లతో వస్తే ఆ గ్రామాల్లోకి నో ఎంట్రీ.!



పుష్యమాసం వచ్చిదంటే చాలు ఆ గ్రామాలు భక్తిభావంతో పులకించిపోతాయి. ఊరు ఊరంతా నియమ నిష్టలతోసాగుతాయి. ఈ మాసంలో ఊరిలో ఉన్న గ్రామస్తులేకాదు అతిథిలు సైతం ఆ ఊరుకట్టుబాట్లు పాటించి తీరాల్సిందే. లేదంటే ఆ గ్రామాల్లోకి అనుమతి లభించిందు. ఆ కట్టు బాట్లు ఆ నియమ నిష్టలు తెలుసుకోవాలంటే అడవుల జిల్లా ఆదిలాబాద్ కు వెళ్లాల్సిందే. ప్రకృతిని పూజించే ఆచారం, కొండా కోనల్లో జీవనం, అడవే జీవనాధారం.. ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల జీవనవిధానం. కట్టుబొట్టు, పూజలు, పండుగలు, జాతరలు తీరొక్కటి ప్రత్యేకమే. పుష్యమాసం వచ్చిందంటే చాలు ఆదివాసీ గూడాల్లో సంబరాలు అంబరాన్ని అంటుతాయి. నియమనిష్టలు కట్టుబాట్లు ఆచార వ్యవహారాలు ఆకట్టుకుంటాయి. పుష్యమాసంలో ఆదివాసీ జాతరలకు అయితే లెక్కేలేదు. గిరిజన కుంభమేళగా సాగే నాగోబా జాతర, ఆరు రాష్ట్రాల ఆదివాసీలను ఒక్కటి చేసే జంగుబాయి జాతర, తొడసం వంశీయుల నూనె సేవనం.. ఇలా అన్నీ ప్రత్యేకమే.



## ఎద అందాలతో కుర్రకారును మత్తెక్కిస్తున్న సన్యా మల్హోత్రా

దంగల్ మూవీతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సన్యా మల్హోత్రా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా లెహంగాలో ఎద అందాలు చూపిస్తున్న ఫొటోలు షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతున్నాయి.సన్యా మల్హోత్ర ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మిసెస్' . జీ5 ఓటీటీ వేదికగా విడుదలైన ఈ చిత్రంపై ఓ పురుష హక్కుల సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చిత్రాన్ని విమర్శిస్తూ పోస్ట్ పెట్టింది.